క్లుప్తంగా

'ఉపాధి' పనుల పరిశీలన



బీబీపేట: కోనాపూర్, యాడారం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ పరిశీలించారు. ప్రతి గ్రామంలో 50 శాతం మందికి తగ్గకుండా ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. అలాగే నర్సరీల్లో మొక్కలను వంద శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో రజిని, టీఏ వినయ్, కార్యదర్శులు భరత్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు అశోక్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో గురువారం షీటీంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యులు ప్రియ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి వివరించారు. వాటి నుంచి రక్షించడానికి తాము ఉన్నామని, వెంటనే ఫిర్యాదు చేయాలని అన్నారు. అధికారులు అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి



ఎల్లారెడ్డి: ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, బాత్‌రూంలు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



కామారెడ్డి టౌన్: న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గురువారం జిల్లా కేంద్రంలోని ఎల్‌ఐసీ కార్యాలయం ముందు ఉద్యోగులు ధర్నా చేపట్టారు. దేశవ్యాప్త పిలుపు మేరకు ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. క్లాస్–3, 4 ఉద్యోగులను తక్షణమే నియమించాలని, అసోసియేషన్‌ను అధికారికంగా గుర్తించాలని, 2012–13లో నియమితులైన కాస్ల్–3, 4 ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, జీవో–57ను తక్షణమే అమలు చేయాలని కోరారు. యూనియన్ నేతలు సంపత్‌కుమార్, అనిల్‌కుమార్, తదితరులున్నారు.

పేదలకు తీవ్ర అన్యాయం



కామారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలు, కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇన్సూరెన్స్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను స్వాగతించడం దారుణమన్నారు. ఎల్‌ఐసీ, పోస్టల్ తదితర బీమా సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. గ్రామీణ ఉపాధి హామీ పనికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై పోరాటానికి రాష్ట్ర ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నేతలు చంద్రశేఖర్, నర్సింలు, మోతీరాం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో విద్యార్థులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ వైద్యులు హరికిషన్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 105 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు సంజయ్, క్రాంతి తదితరులున్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకులు

- ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి
- భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ట్యాంకుల లోపల పెచ్చులూడి నీరు కూడా కలుషితమవుతున్నాయి. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా, శిథిలావస్థకు చేరిన ట్యాంకులు కూలక ముందే వాటిని కూల్చి కొత్తవి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



బలహీనంగా తయారైన ఫరీదుపేటలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ పిల్లర్



ఫరీదుపేటలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్



పెద్దకొడప్‌గల్ తహసీల్ కార్యాలయం సమీపంలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేటలో 1994లో నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు కాలం చెల్లింది. పగుళ్లు ఏర్పడి కొన్నేళ్లుగా నీరు లీకవుతూ పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. 4,696 జనాభా ఉన్న ఈ గ్రామంలో మరో మూడు వాటర్ ట్యాంకులు నిర్మించారు. ఆ మూడు వాటర్ ట్యాంక్‌లు సగం గ్రామానికి నీటిని సరఫరా చేస్తుండగా, శిథిలావస్థకు చేరిన ట్యాంకు మరో సగం గ్రామానికి నీటిని అందిస్తోంది. ఒక వేళ ఆ ట్యాంకు కూలితో సగం ఊరు ఇబ్బంది పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం సమీపంలో గల పాత వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికీ ఈ వాటర్ ట్యాంక్ నుంచే తాగునీటిని సరఫరా చేస్తున్నారు.పెద్దకొడప్‌గల్ గ్రామ ప్రజలకు తాగు నీటి అవసరాలు తీర్చేందుకు సుమారు 40 సంవత్సరాల క్రితం 65 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. దీని ద్వారా గ్రామంలోని బీసీ కాలనీకి నీటి సరఫరా జరుగుతోంది. ఇది ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీనిని పూర్తిగా తొలగించి వేరే చోట కొత్త వాటర్ ట్యాంకును నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ట్యాంక్ లోపలి భాగం పెచ్చులు ఊడిపోవడంతో కలుషిత నీరు వస్తున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ట్యాంక్‌కు సమీపంలో పలువురి ఇళ్లు ఉన్నాయి. ఎప్పుడు కూలుతుందోనని, వారు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన ట్యాంక్‌ను తొలగించి, నూతన ట్యాంక్‌ను నిర్మించి పరిశుభ్రమైన తాగు నీటి సరఫరా చేయాలని కోరుతున్నారు.

కొత్త ట్యాంకు నిర్మించాలి



ఇప్పుడు శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ స్థానంలో మరో ట్యాంకు నిర్మించాలి. ఇప్పటికే నీటి సమస్య ఉంది. ట్యాంకు కూలిపోతే తీవ్రంగా నీటి కష్టాలు ఎదుర్కొనే పరిస్థితి ఉంది.

– ముత్తయ్యగారి మోహన్‌రెడ్డి, ఫరీదుపేట, పాల్వంచ

భయంగా కాలం వెల్లదీస్తున్నాం



ఓవర్ హెడ్ ట్యాంక్ మా ఇంటిపైన ఎప్పుడు పడుతుందోనని భయందోళనగా ఉంటున్నాం. వాటర్ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అధికారులకు పలు మార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా స్పందించి శిథిలావస్థకు చేరిన ట్యాంక్‌ను తొలగించి, నూతన ట్యాంక్‌ను నిర్మించి తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నాం.

– దోసేపల్లి తులసీదాస్, పెద్దకొడప్‌గల్

ఉన్నతాధికారులకు నివేదించాం

ఈ సమస్య గురించి సంబంధిత అధికారులకు నివేదికను పంపాం. త్వరగా నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేపట్టాలని తాము కోరాం. నిధుల లేమి వల్ల పనులు చేపట్టడం ఆలస్యం అవుతుందని చెప్పారు.

– శీను, జీపీ కార్యదర్శి, పెద్దకొడప్‌గల్

నాసిరకం పనులతో ప్రజాధనం వృథా

- నాలుగేళ్లలోనే బీటలు వారిన సీసీ రోడ్లు
- అధికారుల పర్యవేక్షణాలోపమే కారణం



అంకోల్‌లో బీటలు వచ్చిన సీసీ రోడ్డు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): అంకోల్‌లో నాలుగేళ్ల క్రితం వేసిన సీసీ రోడ్లు అధ్వానంగా మారాయి. అధికారుల పర్యవేక్షణాలోపం, కాంట్రాక్టర్ల నిర్వాకానికి ప్రజాధనం వృథా అయింది. గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో సీసీ పనులు చేశారు. పనులు జరిగే సమయంలో అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా కనీసం కన్నెత్తి చూడకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. దీనితో తోడు గ్రామంలో మరో కాలనీలో పనులు సాగుతున్నాయని వాటి అయినా అధికారుల పర్యవేక్షించాలని ప్రజలు వాపోతున్నారు.

వేసిన కొద్ది రోజుల్లోనే బీటలు

వేసిన కొద్ది రోజుల్లోనే సీసీ రోడ్డుకు బీటలు వచ్చాయి. క్యూరింగ్ కోసం కనీసం కట్టలు కట్టి ఉంచాల్సి ఉండగా మట్టితో కట్టి నీటిని పట్టడం మరిచారు. అందుకే నాణ్యత లేకుండా పోయాయి.

– సాయిలు, అంకోల్

ప్రజాధనం వృథా..

సీసీ రోడ్డుపై కేజ్ వీల్ నడిపితే క్రిమినల్ కేసులు విధిస్తామంటారు. అయిలే కాంట్రాక్టర్లు నాసిరకం పనుల చేపడితే వారిపై చర్యలు తీసుకోవాలి. వేసిన కొద్ది రోజుల్లోనే బీటలువారి, పగుళ్లు ఏర్పడటంతో ప్రజా ధనం వృథా అవుతుంది. వీరిపై చర్యలేవి?.

– హన్మండ్లు, అంకోల్

అభివృద్ధిని పట్టభద్రులకు వివరించాలి

- ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్



మాట్లాడుతున్న కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ: ప్రభుత్వం చేసిన అభివృద్ధిని పట్టభద్రులకు వివరించాలని ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘంలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను పట్టభద్రులకు వివరించి ఎమ్మెల్సీ ఓట్లు అడగాలని సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రతి ఒక్క ఓటరును కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు నరేందర్‌రెడ్డికి వేసేలా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు విజయ్‌ప్రకాష్, మధుసూదన్‌రెడ్డి, యామ రాములు, అంజిరెడ్డి, రఘు, శశికాంత్ తదితరులున్నారు.

సర్కిల్ కార్యాలయం ప్రారంభం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్‌లో నూతనంగా నిర్మించిన పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని గురువారం ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా ఎస్పీ సింధుశర్మతో కలిసి ప్రారంభించారు. సదాశివనగర్‌లోని పాత పోలీస్‌స్టేషన్ భవనంలో 2016లో నూతనంగా పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు అక్కడే సర్కిల్ కార్యాలయాన్ని కొనసాగించారు. సర్కిల్ కార్యాలయ నిర్మాణానికి కృషి చేసిన దాతలతో పాటు అధికారులను ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సత్కరించి.. జ్ఞాపికలను అందజేశారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

లక్ష్యాలు, సవాళ్లపై విద్యార్థులకు అవగాహన



దోమకొండ: జీవితంలో లక్ష్యాలు సవాళ్లు అనే అనే అంశంపై అంబారిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్, స్పీకర్ రమేష్ చైతన్య హాజరై మాట్లాడారు. పరీక్షల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, జ్ఞాపక శక్తిని పెంపొందించుకునే చిట్కాలు, ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, నైతిక విలువలు, జీవన నైపుణ్యాలు ఎలా పెంపొందించుకోవాలో ఆయన విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావ్, గోపి, జ్ఞానేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

యూపీఎస్‌పై యుద్ధభేరిని విజయవంతం చేయాలి

టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): యూపీఎస్ విధానానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో మార్చి 2న నిర్వహించ తలపెట్టిన యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్(టీఎస్‌సీపీయస్‌ఈయూ) జిల్లా అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. గోపాల్‌పేట ప్రాథమిక పాఠశాలలో గురువారం సీపీఎస్‌పై యుద్ధభేరికి సంబంధించిన వాల్‌పోస్టర్లను స్థానిక ఉద్యోగులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. యూనియన్ మండల బాధ్యులు అవినాష్, వినీల్ కుమార్, అరవింద్, సంఘమేశ్వర్, కిష్టయ్య, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



కృష్ణాజీవాడి నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): నర్సరీలలో ఉన్న మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. ఆయన గురువారం కృష్ణాజీవాడి నర్సరీని పరిశీలించారు. ప్రతిరోజు మొక్కలకు నీటిని పోసి ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. అధికారులు గ్రామాలలో తిరుగుతూ తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.

కొల్లూర్, నాగారం గ్రామాల్లో..

బాన్సువాడ రూరల్: కొల్లూర్, నాగారం గ్రామ పంచాయితీల్లో గురువారం బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డిలు పర్యటించారు. గ్రామ పంచాయతీల పరిధిలోని నర్సరీని పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా కాపాడాలని పంచాయితీ కార్యదర్శి సృజన్‌రెడ్డికి సూచించారు. నాగారంలో పల్లె ప్రకతి వనం, వైకుంఠధామం, కంపోస్ట్‌షెడ్‌లను పరిశీలించి పంచాయితీ కార్యదర్శి నవీన్‌గౌడ్‌కు పలు సూచనలు చేశారు.

ఎల్లారం, ముస్తాపూర్ గ్రామాల్లో..

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారం, ముస్తాపూర్ శివార్లలో ఏర్పాటు చేసిన నర్సరీలను గురువారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. అలాగే ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. క్షేత్రసహాయకుడు సాయన్న, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సోయా కొనుగోలు ప్రారంభం



ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

మద్నూర్(జుక్కల్): జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రత్యేక చొరవతో మండల కేంద్రంలో సోయా పంట కొనుగోలు కేంద్రం పున: ప్రారంభం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సోయా పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ ముజీబ్ ఈ సందర్భంగా తెలిపారు. సోయా పంట కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ పరిశీలించారు. గత నెల 7న సోయా కొనుగోలు పూర్తయిందని అధికారులు కేంద్రాన్ని మూసివేశారు. దీంతో పంట అమ్ముకోని రైతులు ఆందోళన చేపట్టారు. రైతులకు చెందిన సోయా పంట కొనుగోలు కేంద్రం వద్ద ఉండగా ఎలా మూసివేస్తారని ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కొనుగోలును తిరిగి ప్రారంభింపజేశారు. రైతులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

కలెక్టర్ రాకతో చెత్త తొలగింపు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణ శివారులోని డంపింగ్ యార్డుకు చెత్తను తరలించకుండా మున్సిపల్ సిబ్బంది రోడ్డు పక్కన పారవేశారు. గురువారం కలెక్టర్ డంపింగ్ యార్డును సందర్శించనుండటంతో రోడ్డు పక్కన ఉన్న చెత్తను ట్రాక్టర్ ద్వారా తొలగించారు. అధికారుల రాక సందర్భంగా రోడ్డు పక్కన చెత్తను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వైకల్యం అసమర్థత కాదు



రామారెడ్డి: వైకల్యం అనేది అసమర్థత కాదని రామారెడ్డి ఎంఈవో ఆనంద్‌రావు అన్నారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(ఉప్పల్వాయి) ఆధ్వర్యంలో గురువారం రామారెడ్డి భవిత సెంటర్‌లోని దివ్యాంగ విద్యార్థులకు మానసిక స్థైర్యం పెంపొందించటానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ... అనుకున్న లక్ష్యాన్ని చేరడంలో వైకల్యం ఏమాత్రం అడ్డు కాదని, వాటిని అధిగమించి ముందుకు సాగాలని అన్నారు. దివ్యాంగ పిల్లలకు టిఫిన్ బాక్సులు, స్వీట్లు పంపిణీ చేశారు. భవిత సెంటర్ ఉపాధ్యాయురాలు సంజన, అటెండర్ శోభ సేవలను గుర్తించి సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపల్ శివరాం, వైస్ ప్రిన్సిపల్ సురేందర్ రెడ్డి, పీఎంశ్రీ బాధ్యులు సంతోష్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభాకరచారి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): విధుల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదని, సమయపాలన పాటించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. అక్కంపల్లి అంగన్‌వాడికేంద్రంతోపాటు పల్లెదవాఖానా, ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని శేర్‌ఖాన్‌పల్లి, సింగితం గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాలను గురువారం స్థానిక సూపర్‌వైజర్ రాజేశ్వరి తనిఖీ చేశారు. చిన్నారుల బరువులు, ఎత్తు కొలతలు తీశారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. టీచర్లు సప్న, గంగామణి తదితరులు ఉన్నారు.

పంట సాగులో మెలకువలు పాటించాలి



ఎర్రాపహాడ్‌లో మాట్లాడుతున్న విద్యార్థులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు పంటలు పండించేటప్పుడు మెలకువలు పాటించాలని అగ్రికల్చరల్ ట్రైనింగ్ విద్యార్థులు అన్నారు. ఎర్రాపహాడ్ రైతు వేదిక కార్యాలయంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు సదస్సును ఏర్పాటు చేశారు. రైతులు ఈ సీజన్‌లో వేరుశనగ, కుసుమ, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, వేరుశనగ వంటి పంటలను సాగు చేయాలన్నారు. పంటలను వేసుకునే ముందు విత్తనాల రకాలు, విత్తన మోతాదు, విత్తన శుద్ధి తదితర విషయాలపై సమగ్రచర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహామేరకు పంటలకు ఎరువులు వేసి మందులను పిచికారీ చేయాలని సూచించారు.

ఎరువుల వాడకంపై అవగాహన

రామారెడ్డి: వ్యవసాయంలో రైతులు ఎరువులు ,పురుగుల మందుల వాడకంపై ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో పోసానిపేట రైతు వేదికలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. కంపెనీ ఏరియా మేనేజర్ ఎన్ నరేష్ .. పురుగుమందులు వాడే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనల గురించి వివరించారు.

సంక్షిప్తం

దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు



రాజంపేట: దివ్యాంగ పిల్లలను చిన్న చూపు చూడొద్దని, అందరిని సమానంగా చూడాలని ఎంఈవో పూర్ణచంద్రరావు అన్నారు. గురువారం తలమడ్ల ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగ పిల్లలకు ప్రత్యేకంగా విద్యను కూడా బోధిస్తున్నామన్నారు. వారికి ఆటల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం భిక్షపతి, ఐఆర్‌పీ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రజలందరికీ 40 రోజుల్లో వైద్య పరీక్షలు



భిక్కనూరు: మధుమేహం, రక్తపోటు, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ వ్యాధులను గుర్తించడానికి 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వ వైద్యులు దివ్య సూచించారు. ఆమె బుధవారం భిక్కనూరు ప్రభుత్వాస్పత్రిలో ఏఎన్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 40 రోజుల్లో ప్రజలందరికీ పరీక్షలు నిర్వహించి వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బిచ్కుంద(జుక్కల్): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి సత్తా చాటాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. గురువారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. క్రీడలను ప్రిన్సిపాల్ అశోక్, నెహ్రూ యువకేంద్రం నాయకులు సునీల్ రాథోడ్ ప్రారంభించారు. పోటీలలో బిచ్కుంద, డోంగ్లీ, జుక్కల్, మద్నూర్ మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. బాడ్మింటన్, కబడ్డీ, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు వెంకటేష్, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్ చార్జీలపై రాయితీ

కామారెడ్డి టౌన్: హైదరాబాద్ నుంచి విజయవాడ మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సు టికెట్ చార్జీలపై రాయితీ ఇవ్వనున్నట్లు కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని బస్సుల బేసిక్ టికెట్ చార్జీపై 8 శాతం, లహరి నాన్ ఏసీ కమ్ సీటర్ బస్ టికెట్ చార్జీపై 4 శాతం, లహరి నాన్‌ఏసీ స్లీపర్ సీటు, సూపర్ లగ్జరీ బస్సులలో టికెట్ చార్జీపై 10 శాతం రాయితీ ఇస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ సంస్థ వెబ్‌సైట్ www.tgsrtcbus.in ద్వారా ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.